క్లుప్తంగా

బంగారు పతకం సాధించిన డాక్టర్ లక్ష్మీకళ



గవర్నర్ నుంచి పతకం అందుకుంటున్న లక్ష్మీకళ

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంటపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ లక్ష్మీకళ డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. శ్రీమతి అద్ద వెంకాయమ్మ బంగారు పతకాన్ని వెంకటరామన్నగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టర్ లక్ష్మీకళ ఇటీవల అందుకున్నారు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని తీసుకున్న సందర్భంగా పొదలకుంటపల్లె గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ఆమెను అభినందించారు.

డీఎస్పీతో ఎమ్మెల్యే అన్నా భేటీ



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా

మార్కాపురం: మార్కాపురం డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వీరరాఘవరెడ్డిని శుక్రవారం సాయంత్రం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీకి ఆయన కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేదలకు సత్వర న్యాయం అందేలా చూడాలని కోరారు.

రేపు హనుమాన్ జయంతి వేడుకలు

గిద్దలూరు రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని రేడియో బావి సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ చేయనున్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యర్రగొండపాలెం: పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఏఈ కిషోర్ తెలిపారు. ఆయా మండలాల్లోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల్లో సాంకేతిక మరమ్మతుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌లో అంతరాయం కలుగుతుందని, ఈ విషయం వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

యర్రగొండపాలెం: జగనన్న హౌసింగ్ కాలనీల్లో లబ్ధిదారులు తమ గృహాలను వేగవంతంగా నిర్మించాలని ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు కోరారు. శుక్రవారం స్థానిక మిల్లంపల్లిలోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు నిర్మించుకునేందుకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, సంబంధిత అధికారులతో సంప్రదించి ఆయా ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. లబ్ధిదారుల గృహాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఎంపీడీఓ ఆదేశించారు. హౌసింగ్ డీఈఈ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రామారావు నాయక్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

మార్కాపురం టౌన్: మండలంలోని నాయుడుపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి వాణికి మార్కాపురం రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.7 వేల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం సాయంత్రం అందించారు. అథ్లెటిక్స్‌లో 400, 1500 మీటర్ల రన్నింగ్‌లో విజయం సాధించిన వాణి.. శిక్షణ నిమిత్తం ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో ఆర్థికసాయం చేసినట్లు కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కోచ్ చిట్టిబాబు, వెన్నా వెంకటరెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

బేస్తవారిపేట: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పిల్లలతో ఇంగ్లిష్, తెలుగు చదివించడం, నీతి కథలు చెప్పించడం, ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ గ్రామర్, డ్రాయింగ్, చెస్ పోటీలు నిర్వహించారు. జూన్ 11వ తేదీ వరకు జరిగే శిబిరంలో విద్యార్థులందరూ పాల్గొనాలని కోరారు.

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ



వేమయ్యస్వామి మూలవిరాట్



పూజలందుకుంటున్న ఉత్సవ విగ్రహాలు

కొనకనమిట్ల: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ఐదు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్న మల్లికార్జునస్వామి ఆలయ శిఖర, కళశ, జీవ, ధ్వజ పూర్వక అదిత్యాది నవగ్రహ సహిత వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర, పోతురాజుస్వామి సహిత పోలేరమ్మ దేవతా ప్రతిష్ఠ, అంకాళమ్మ, నాగేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. వేదమంత్రాలు, మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య నూతన ధ్వజ స్తంభ స్థాపన చేశారు. ఆగమ పండితులు ఓరుగంటి సీతారామశర్మ, శిష్యబృందం ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. పూర్ణాహుతి, శాంతికళ్యాణం అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహకులు శుక్రవారం తెలిపారు. వేమయ్యస్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా 13వ తేదీ శనివారం సాయంత్రం కలశ గ్రామోత్సవం, 14వ తేదీ ఆదివారం ఆలయంలో ఉదయం నాలుగు గంటలకు గణపతి పూజ, అభిషేకం, అఖండ స్థాపన, అంకురారోపణం, మండల అవాహం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అరాధన మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

వేడుకగా సీతారామ కల్యాణం

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో రామదూత క్షేత్రంలో శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేదపండితుడు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలుగా పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శనివారం సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కరెన్సీ హనుమాన్..!

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో నాగులపుట్ట వీరాంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని శుక్రవారం సాయంత్రం అర్చకులు నారాయణం త్రివిక్రమ ప్రసాద్, ఎ.రాఘవచార్యులు కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వానాథం, అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, గోపిశెట్టి కొండయ్య, కోశాధికారి పి.ఆదినారాయణ తదితరులు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంత్యుత్సవాలు శనివారం నుంచి రెండు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని గొట్లగట్టు గ్రామంలోని అభయ వీరాంజనేయస్వామి, కొనకనమిట్ల



కరెన్సీ నోట్లతో ఆంజనేయస్వామి అలంకారం



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

రామదూత క్షేత్రంలో అభయాంజనేయస్వామి, నాయుడుపేట, పాతపాడు, గరిమినపెంట గ్రామాల్లోని వీరాంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు. గొట్లగట్టు గ్రామంలో శనివారం గణపతి పూజ, ఆకు పూజా కార్యక్రమాలు, రాత్రికి చెంచులక్ష్మి పౌరాణిక నాటకం, ఆదివారం సువర్చలా ఆంజనేయస్వామి కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించాలి



మాట్లాడుతున్న డీపీఓ నారాయణరెడ్డి



అధికారులతో సమావేశమైన డీపీఓ

● డీపీఓ జీవీ నారాయణరెడ్డి

దర్శి: మండల ప్రత్యేకాధికారులు విధిగా గ్రామాల్లో పర్యటించాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ వంటి ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని డీపీఓ ఆదేశించారు. అందుకు కావాల్సిన ఇసుక, సిమెంట్, ఇనుము వంటి సామాగ్రి లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల నుంచి లబ్ధిదారులకు రుణాలు అందేలా చూడాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎస్ఆర్, సీఎల్ఎస్ఆర్ ట్యాంక్‌లను వెంటనే శుభ్రపరచాలని ఆదేశించారు. బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేసి లాస్ట్ క్లీనింగ్ తేదీలు నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామంలో నలుమూలలా పర్యటించి సుస్థిర పారిశుధ్య నిర్వహణ కొనసాగించాలని ఆదేశించారు. గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్‌లను పరిశీలించి తీగ జాతి అల్లుకునే మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతి కార్యక్రమంలో పురోగతి వచ్చేలా అధికారులు పని చేయాలని డీపీఓ ఆదేశించారు. ఎంపీడీఓ కుసుమకుమారి, ఈఓఆర్డీ శోభన్‌బాబు, ఆయా శాఖల అధికారుల పాల్గొన్నారు.

దొనకొండ: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు ప్రారంభించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని పెదన్నపాలెంలో ఆయన ఎంపీడీఓ వి.వసంతరావునాయక్‌తో కలిసి జగనన్న కాలనీలను శుక్రవారం పరిశీలించారు. ఫ్రైడే డ్రైడే కార్యాక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారులతో మాట్లాడి వీలైనంత వరకు గృహాలు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పెదన్నపాలెంలో పారిశుధ్య పనులను డీపీఓ పరిశీలించారు. ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్‌ను క్లీన్ చేయించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంక్‌ను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గ్రామంలోని వీధుల వెంట చెత్త చెదారం ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయం పరిసరాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం అధికారులతో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు. సర్పంచ్‌లు మిండాల మంగమ్మ నాగయ్య, కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీఎం జి.వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ ఎస్.డేవిడ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శి యల్లాబాబు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

● ఐబీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కృపారావు



మాట్లాడుతున్న కృపారావు

దర్శి: విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఐబీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కృపారావు హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం దర్శి, కురిచేడు, ముండ్లమూరు మండలాల సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. కృపారావు మాట్లాడుతూ సంఘాల లావాదేవీలు ఆన్‌లైన్ చేయడంలో వెనకబడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘాల బలోపేతమే లక్ష్యంగా ప్రాజెక్ట్ నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాల్సిందేనని చెప్పారు. జగనన్న కాలనీల లబ్ధిదారులకు రుణాలు ఇప్పించడం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత నిచ్చి వారి జీవనాభివృద్ధికి తోడ్పాటు అందించాలని చెప్పారు. అర్హత ఉన్న చిరువ్యాపారులకు జగన్న తోడు రుణాలు అందించాలని కృపారావు ఆదేశించారు. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నూతనంగా చేపడుతున్న లోకోస్ యాప్‌పై అవగాహన పెంచుకుని సభ్యులు, సంఘాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని చెప్పారు. ఎలాంటి తప్పులు జరిగినా అందుకు పూర్తి బాధ్యత గ్రామ సంఘ సహాయకులదేనన్నారు. కొందరి నిర్లక్ష్యం కారణంగా అందరూ ఇబ్బంది పడతారని తెలిపారు. సంఘాల గ్రేడింగ్ పెంచేందుకు పటిష్ట ప్రణాళికలతో పని చేయాలన్నారు. వచ్చే నెలనాటికి పని తీరు మెరుగు పరచని, లక్ష్యసాధనలో వెనకబడ్డ వారిపై శాఖ పరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో దర్శి ఏరియా కోఆర్డినేటర్ వసుందరాదేవి, దర్శి, కురిచేడు, ముండ్లమూరు మండలాల ఏపీఎంలు విజయకుమారి, సైమన్, హనుమంతరావు, జిల్లా శిక్షకులు ఇందు, మూడు మండలాలల సీసీలు, గ్రామ సంఘ సహాయకులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

దొనకొండ: దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన మల్లంపేట గ్రామంలో ఆరు రోజుల నుంచి రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వాటర్‌షెడ్ రైతులకు కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఉషా, శివ, జాహ్నవి, బాలకృష్ణ, వెంకటేశ్వరరెడ్డిలు రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై, మెట్ట సాగు మెళకువలపై, ఉద్యాన పంటలో సస్య రక్షణ చర్యలపై, మట్టి నమూన ఆవశ్యకత, భూసార పరీక్ష ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గొర్రెల పెంపకం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రతి విషయాన్ని రైతులు అవగాహన చేసుకుని పాడి పంటలు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

మార్కాపురం టౌన్: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న పిల్లల వైద్యుడు మాధవరావు, ఆర్థోపెడిక్ సర్జన్ సంజీవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో క్రీడా శిక్షణకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో కోచ్‌లు కాశంగి శ్రీను, వేణు, రాంబాబు, రామకృష్ణ, సంస్థ అధ్యక్షుడు పిన్నిక నాగేశ్వరరావు, కార్యదర్శి కిరణ్‌కుమార్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలి

వేటపాలెం: రాబోయే 2023 ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని రామన్నపేట రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వేసవిలో పంట కాల్వల్లో పూడిక తీత పనులు, కాలవలపై కల్వర్టుల నిర్మాణాలు, చేపట్టాలన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా అందే విధంగా సిబ్బంది చూడాలన్నారు. ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏఓ ఐ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ రైతు భరోసాకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలు గ్రామాల పరిధిలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. త్వరలో రైతు భరోసా నిధులు వారి బ్యాంకు ఖాల్లో జమవుతాయిని తెలిపారు. మండల కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను జిల్లా స్థాయి కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగిలి రామారావు, పశువైద్యాధికారి భాగ్యశ్రీ, ఐటీసీ గ్రామ సిరి ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్ శ్రీనివాసశాస్త్రి సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర విద్యాలయం (పీటీజీ)లో 3 నుంచి 10వ తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎం.చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. 3వ తరగతిలో 75 చెంచు, ఎస్సీ-2, బీసీ-2, ఓసీ-1 చొప్పున ఖాళీలు ఉన్నాయని, 4వ తరగతిలో 50, 5వ తరగతిలో 63, 6వ తరగతిలో 63, 7వ తరగతిలో 10, 8వ తరగతిలో 20, 9వ తరగతిలో 47 చొప్పున ఖాళీలు ఉన్నాయని, 4వ తరగతి నుంచి ఉన్న ఖాళీల్లో చెంచు విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో చేరగోరు విద్యార్థులు జూన్ 5వ తేదీలోపు తమ దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాల కోసం సెల్: 83094 62537 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఉమామహేశ్వరపురం ఎస్సీ కాలనీలో విషాద ఛాయలు

ముండ్లమూరు: మండంలోని ఉమామహేశ్వరపురం ఎస్సీ కాలనీకి చెందిన పూనూరి మెస్సేక్ (15) తొమ్మిదో తరగతి విద్యార్థి అద్దంకి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దీంతో కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాలనీకి చెందిన పూనూరి వెంగయ్య, మార్తమ్మలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు షెడ్రక్ దర్శిలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. రెండో కుమారుడు మెస్సేక్ ఉమామహేశ్వరపురంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చిన్న కుమార్తె కీర్తన అదే పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వేసవి సెలవులు కావడంతో ఖాళీగా ఉండకుండా కుటుంబానికి కుటుంబానికి చేదోడుగా ఉండేందుకు గ్రామానికి చెందిన వారితో కలిసి శుభకార్యాలకు విద్యుత్ సరఫరా చేసే వారితో కలిసి కూలి పనికి అద్దంకి మండలం ఉప్పలపాడు గురువారం ఉదయం వెళ్లాడు. శుక్రవారం ఉదయం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో అద్దంకి వద్ద డివైడర్‌ను ఆటో ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు భోరున విలపించారు.

రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలి

ముండ్లమూరు: పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులందరూ ఈకెవైసీ చేయించేకోవాలని మండల వ్యవసాయాధికారి మేరమ్మ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. రైతులకు ప్రభుత్వ రాయితీలు వర్తించాలన్నా, పీఎం కిసాన్ కోసం ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని ఈకెవైసీ ద్వారా వేలిముద్రలు వేయాల్సి ఉందన్నారు. రాయితీపై పచ్చిరొట్టి విత్తనాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

గరిష్ట వేతనం పొందేలా పని చేయాలి



గడ్డపారతో తొవ్వుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి

పెద్దారవీడు: ఉపాధి కూలీలు దినసరి గరిష్ట వేతనం పొందేలా పనులు చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ నాసర్‌రెడ్డి సూచించారు. మండలంలోని తోకపల్లె సచివాలయం పరిధిలో ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించి మస్టర్ సమర్థంగా నిర్వహించేందుకు మేట్‌లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులకు రాని వారికి హాజరు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగార్జునరెడ్డి, హరికృష్ణ, కూలీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అధికారులు, సిబ్బందితో డీడీ నరసింహారావు

గిద్దలూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యతగా భావించాలని అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వై.నరసింహారావు అన్నారు. పర్యావరణహిత జీవనశైలి కార్యక్రమంలో భాగంగా స్థానిక అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం అటవీశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని చెప్పారు. అడవులను సంరక్షించడంలో అంకిత భావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. రేంజి ఆఫీసర్లు కుమార్‌రాజు, జీవన్‌కుమార్, సౌజన్య, డీఆర్‌ఓలు మాధవరావు, వంశీకృష్ణ, బాలాజీనాయక్, ఎఫ్ఎస్‌ఓలు, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెద్దారవీడు: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి బలమైన గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రం పెద్దారవీడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం .. దేవరాజుగట్టు గ్రామం నుంచి దోర్నాలకు ద్విచక్ర వాహనంపై శ్రీనివాసులు అనే వ్యక్తి బయల్దేరాడు. దోర్నాల నుంచి మార్కాపురం గుర్తు తెలియని వాహనం వెళ్తోంది. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శ్రీనివాసులు తలకు బలమైన గాయమైంది. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి క్షతగాత్రుడిని మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు బేల్దారి మేస్త్రీ. దేవరాజుగట్టులో ఇంటి నిర్మాణ పనులు ముగించుకుని సొంత గ్రామానికి బయల్దేరగా ప్రమాదం జరిగింది.

17న మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'నవోదయ' ప్రతిభ



సుధామాధురి



అరవింద్ గౌడ్



టి.హరికృష్ణ

తర్లుపాడు: సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో మండలంలోని కలుజువ్వలపాడు వద్ద జవహర్ నవోదయ విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 40 మంది పరీక్షకు హాజరుకాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తెలిపారు. ఎం.సాయి సుధామాధురి 458 మార్కులతో ప్రథమ స్థానం, ఏవీసీఏ అరవింద్‌గౌడ్ 457 మార్కులతో ద్వితీయ స్థానం, టి.హరికృష్ణ 446 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని వివరించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ

తర్లుపాడు: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలకు లోకోస్ యాప్‌పై ఏపీఎం డి.పిచ్చయ్య శుక్రవారం శిక్షణ ఇచ్చారు. యాప్‌లో ప్రతి సభ్యురాలి సమాచారం పొందుపరచాలని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాల లావాదేవీల పూర్తి సమాచారం, వెలుగు పథకంలో మంజూరైన పథకాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరిశీలకులు ఎంసీ నాగభూషణం, ట్రైనర్స్ షేక్ కరీష్మా, నూనె సుధారాణి, సీసీలు పాల్గొన్నారు.